క్లుప్తంగా

సమాధుల తొలగింపు




దంపింగ్ యార్డ్‌లో ఉన్న సమాధి రాళ్లు

మధిర: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో అనేక దశాబ్దాలుగా ఉన్న పూర్వీకుల సమాధులను తొలగించారని బాధితుడు శ్రీకాకుళపు కృష్ణమాచారి ఆరోపించారు. బుచ్చిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో తరతరాలుగా ప్రభుత్వ స్థలంలో తమ పూర్వీకులు చనిపోతే ఆ స్థలంలో సమాధి చేస్తున్నామని తెలిపారు. అయితే పక్కనే ఉన్న డంపింగ్ యార్డ్ శుభ్రం చేసేటప్పుడు గ్రామపంచాయతీ కార్యదర్శి తమ పూర్వీకుల సమాధులను కూడా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లి జానకమ్మ సంవత్సరికమని ఆదివారం పూజలు చేసేందుకు సమాధుల వద్దకు వెళ్లగా సమాధులు, నందులు లేవని తెలిపారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి హేమలతను వివరణ కోరగా చెత్తలో ఉన్న సమాధులు తమకు కనిపించలేదని వాటిని తిరిగి అదే స్థానంలో ఉంచేవిధంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ముత్యాలమ్మ తల్లికి బోనాలు



బోనాలతో ప్రదర్శనగా వస్తున్న మహిళలు

కారేపల్లి: మండలంలోని తొడితలగూడెం గ్రామంలో ప్రజలు ముత్యాలమ్మకు బోనాలను ఆదివారం సమర్పించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మహిళా భక్తులు బోనాలను నెత్తిన పెట్టుకొని ప్రదర్శనగా ముత్యాలమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అనంతరం ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యులు పెద్దబోయిన ఉమాశంకర్, సర్పంచ్ బాణోతు కుమార్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న సాంబశివరావు

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సాంబశివరావు అందించాడు. ఆయన మాట్లాడుతూ.. ఎంపీ నామా నాగేశ్వరరావు కృషితో ఈ చెక్కులు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కత్తి రవి, గొల్లపూడి యాకోబు, సగ్గుర్తి ప్రభాకర్ ఉన్నారు.

దాడులను అరికట్టాలి



తల్లాడలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

తల్లాడ: మణిపూర్‌లో క్రైస్తవులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ ఆదివారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక లూర్దుమాతా చర్చి నుంచి ర్యాలీ ప్రారంభమై తల్లాడ ప్రధాన రహదారుల్లో కొనసాగింది. కార్యక్రమంలో పాస్టర్లు మేకల ప్రసాదరావు, మేడి ఇశ్రాయేలు, సంగసాని శ్రీనివాస్, కె.ఇశ్రాయేలు, కెనడీరాజు పాల్గొన్నారు.

గంద్ర ప్రతాప్‌రెడ్డికి సత్కారం



గంద్ర ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న జీడీఎస్ ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో మర్లపాడు బీపీఎంగా పనిచేస్తూ.. ఉద్యోగ విరమణ పొందిన గంద్ర ప్రతాప్‌రెడ్డిని తపాలా ఉద్యోగులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జీడీఎస్ యూనియన్ తెలంగాణ సర్కిల్ కోశాధికారి మట్టే వెంకటేశ్వరరావు, ఖమ్మం అకౌంటెంట్ ఐ.కిరణ్‌కుమార్, ఉద్యోగ సంఘం నాయకులు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, ఉమేష్, వీరన్న, రాంప్రసాద్, రమణ, నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, సర్వేశ్వరరావు, జానీ, నర్సింహారావు పాల్గొన్నారు.

జోరుగా.. సాగుతోంది

- ముమ్మరంగా వరినాట్లు, ఇతర పంటలు
- నిండిన చెరువులు, కుంటలు
- ఆనందంలో రైతన్నలు
- సన్నరకాల సాగుకే మొగ్గు..



నీటితో కళకళలాడుతున్న చెరువు



వరినాట్లు వేస్తున్న కూలీలు



పత్తిచేలో పాటు చేస్తున్న రైతు

కల్లూరు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతన్నలు పొలం పనులు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాల కారణంగా చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండడంతో మండలంలో వ్యవసాయపనులు జోరందుకున్నాయి.

మండలంలో సాగు వివరాలిలా..

మండలంలోని చెరువులు, కుంటల కింద సుమారు 17వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. అదే విధంగా నాగార్జున సాగర్ ఆయకట్టు కింద 25 వేల ఎకరాలు.. లిఫ్ట్, బోర్ల కింద మరో 7వేల ఎకరాలలో ఆయకట్టు సాగు చేస్తున్నారు. మండలంలో ఈ నెలాఖరులోపు సాగర్ కాలవలో నీరు విడుదల చేస్తారనే నమ్మకంతో రైతులు వరినాట్లు సిద్ధం చేశారు. ఎగువన ఉన్న శ్రీశైలం డ్యామ్‌లో ప్రస్తుతం 836 అడుగుల నీరు ఉండగా పూర్తిస్థాయి నీటి మట్టం 945 అడుగులు ఉంది. ఎకరం పొలం నాటు వేస్తే రూ.4000లు నుంచి రూ.4,500లు వరకు కూలీలకు ఖర్చు అవుతుంది. కరివేద సాగుతో.. రైతులకు ఎకరానికి కనీసం రూ.4,000లు ఆదా అవుతాయి.

వాణిజ్య పంటల సాగు ముమ్మరం..

ఈ ఖరీఫ్‌లో ఇప్పటికే గరిష్ఠంగా వర్షాలు కురవటంతో భూమిలో తేమశాతం అదనంగా ఉంది. వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి, కంది, పెసర, మినుములు, మొక్కజొన్న పంటలు ముమ్మరంగా సాగు చేస్తున్నారు. ఈ నెలలో డివిజన్ పరిధిలో సుమారు 1.34 లక్షల ఎకరాల్లో వాణిజ్య పంట సాగుకు రైతులు ప్రాధాన్యత ఇస్తుండటంతో ఈసారి పత్తి, మిర్చి, పంటల సాగు గణనీయంగా పెరిగింది.

సన్నరకం సాగు చేస్తున్నాం..



ఈ ఖరీఫ్ సీజన్‌లో బీపీటీ సాంబమసూరి (5204) రకం వరిని సాగు చేస్తున్నా. మొదటి సారిగా ఈ సీజన్‌లో కరివేద పద్ధతిలో.. వరి విత్తనాలు వెదజల్లె పద్ధతిలో పంట పండిస్తున్నా. చెరువులు, కుంటలు నిండి పోయినందున ఖరీఫ్ పంటలకు సాగు నీటి సమస్య ఉండదు. కరివేద పద్ధతి సాగు విధానం ద్వారా ఖర్చు తగ్గింది.

– రంగు లక్ష్మణ్‌రావు, రైతు, పుల్లయ్య బంజరు

సాగర్ ఆయకట్టు కింద..



నాగార్జున సాగర్ ఆయకట్టు కింద ఈ ఖరీఫ్‌లో కింద 70శాతం వరి పంట లు, మరో 30శాతం ఇతర పంటలు వేస్తున్నాం. సాగర్ నీరు సరఫరా అవుతాయనే భరోసాతో ఆయకట్టు పరిధిలో పంటలు సాగు చేస్తున్నాం. సాగర్ డ్యామ్‌లో గరిష్ఠ స్థాయిలో నీరు చేరడంతో ఈ నెలలోనే కాలువల్లోకి నీరు విడుదల చేస్తారని ఆశిస్తున్నాం.

– కర్నాటి పిచ్చిరెడ్డి, కప్పుల బంధం

బీఆర్ఎస్‌నే గెలిపించాలి

బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన తడికమళ్ల సందీప్, మేకల రవి, గద్దల నాగరాజు, తడికమళ్ల అనీల్‌ల ఆధ్వర్యంలో యువతతో పాటు 25 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సమక్షంలో ఆదివారం చేరారు. వీరిని ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ముందుగా ఆయనకు బైక్ ర్యాలీతో, పూలాభిషేకంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధిని చూసి ప్రజలు పార్టీలో చేరుతున్నరన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రామారావు, ఆత్మకమిటీ చైర్మన్ వాసు, నాయకులు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సురేష్, వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డి, దేశిరెడ్డి నాగిరెడ్డి, చెన్నారెడ్డి, రాంబాబు, కోటేశ్వరరావు, సోములు, రాంబాబు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

వైరా: వైరాలో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ టీపీకి చెందిన పెరుగు ప్రసాద్ నేతృత్వంలో ఆదివారం మదన్‌లాల్ సమక్షంలో వైఎస్సార్ టీపీ పార్టీకి చెందిన సుమారు 150 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరాయి. ఈ సందర్భంగా మదన్‌లాల్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చిరునోముల గ్రామంలో..

బోనకల్: మండలంలోని చిరునోముల గ్రామంలో ఆదివారం పలు పార్టీల నుంచి 70 కుటుంబాలు జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు సమక్షం బీఆర్ఎస్‌లో చేరాయి. కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున్, నాగేశ్వరరావు, కొండ, బ్రహ్మయ్య, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



వైరా: గులాబీ కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్



బోనకల్: పార్టీలో చేరిన వారితో లింగాల కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు

విద్యుత్ సంస్కరణల చట్టం రద్దు చేయాలి



మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ చట్టం రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో తెలంగాణ రైతు సంఘం సభ్యత్వాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని కౌలు రైతులను రైతులుగా గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పంట నష్టపోయి అనేక మంది కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటే.. కనీసం వారికి పరిహారం కూడా అందడం లేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం కౌలు రైతులకు భీమా సౌకర్యంతో పాటుగా సమగ్ర కౌలుదారి చట్టం తీసుకురావాలని అన్నారు. కేంద్రం విద్యుత్ సంస్థల చట్టం రద్దు చేసే వరకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, రాములు, వెంకటమ్మ, వీరాస్వామి, అంజమ్మ, నర్సమ్మ, రుక్మిణి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ జాతీయ జెండాల పంపిణీ

తల్లాడ: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మండలంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. నరేంద్ర మోదీ పిలుపు మేరకు వీటిని పంపిణీ చేస్తున్నామని, అందరూ ఆగస్టు 15న జెండాలను ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, రాయల రమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీయంబంజర్‌లో..

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్ బేడా బుడగ జంగం కాలనీలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ జాతీయ జెండాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, మండల నాయకులు మహేష్, ప్రసాద్, రాఘవులు, గంగమ్మ, గంగా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి: పంపిణీ చేసిన జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు

జాతీయ పతాకాన్ని విక్రయించడం సరికాదు

తల్లాడ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జాతీయ జెండాను పోస్టాఫీస్ ద్వారా ఒక్కో జెండా రూ.25లకు విక్రయించడం సరైంది కాదని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సత్తెనపల్లి నరేష్ అన్నారు. జాతీయ జెండాలను కేంద్రం ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.



తల్లాడలో జాతీయ జెండాను విక్రయిస్తున్న పోస్టాఫీస్ సిబ్బంది

దళితబంధు పేరుతో మోసం చేస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

బోనకల్: దళితబంధు బోనకల్ మండలానికి వస్తుందని చెప్పి బీఆర్ఎస్ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగోసారి ఓటమి భయంతో కమల్‌రాజ్ ఎన్నికల ముందు దళితబంధు వస్తుందని చెప్పి పార్టీలో చేర్చుకుంటున్నారని విమర్శించారు. దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి వంటి పథకాలు మీకే ఇస్తామని చెప్పి ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. ప్రజలు ఈ మాయమాటలు నమ్మొద్దన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ గుగులోత్ రమేష్, మరీదు శ్రీను, వరికూటి వెంకటి, అన్నెపోగు అరుణ్, మందా రవి తదితరులు పాల్గొన్నారు.

మృతులకు ఎమ్మెల్యే సండ్ర నివాళి

సత్తుపల్లిరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన తల్లీ, కొడుకు రాయల తులిశమ్మ, సత్యనారాయణ(చంటి)లు మరణించగా ఆదివారం జరిగిన దశదిన కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ రామారావు, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గంగారం సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ రంగారెడ్డి, ఉపసర్పంచ్ కృష్ణ, బాలాజీరెడ్డి, ఆత్మ చైర్మన్ వాసు, హరికృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, అవినాష్, తిప్పర్తి ఈశ్వర్, గజ్జెలి కృష్ణ ఉన్నారు.

రెడ్డిగూడెం ఆర్‌సీఎం చర్చిని సందర్శించిన ఎమ్మెల్యే ..

తల్లాడ: మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. చర్చి నిర్వాహకులు ఎమ్మెల్యే సండ్రను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం నిర్మల, దుగ్గిదేవర వెంకట్‌లాల్, జీవీఆర్, కొనకంచి లక్ష్మణ్, పానెం శ్రవణ్ పాల్గొన్నారు.

నేడు పల్లిపాడులో పశుధాన్ జాగృతి అభియాన్

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడులో నేడు ప్రధానమంత్రి 'పశుధాన్ జాగృతి అభియాన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గోపాలమిత్ర సూపర్‌వైజర్ టి.లక్ష్మీనారాయణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో పశువైద్య విద్యాలయం, పశువైద్య కళాశాల మామునూరు వరంగల్ వారిచే ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులచే పశువులలో పునరుత్పత్తి, ఫలదీకరణ వ్యాధులకు పరీక్షలు చికిత్స నిర్వహిస్తారని తెలిపారు. కృత్రిమ గర్భధారణపై రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలరావు

చింతకాని: ఖమ్మం-బోనకల్లు ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చింతకానిలోని పార్టీ కార్యాలయంలో మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారి గోతులు పడి ప్రమాదంగా మారిందని.. ముఖ్యంగా జగన్నాధపురం నుంచి తుమ్మలమ్మ వాగు వరకు గోతులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ రహదారులపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజాప్రతినిధులు కూడా మరమ్మతులు చేయకపోవడం దారుణమన్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పందిళ్లపల్లి నుంచి నాగులవంచ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, పార్టీ మధిర నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్‌తో పాటు మండల కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ పాదయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు వత్సవాయి జానకి రాములు, కృష్ణమూర్తి, ఉపేందర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న గురువులకు సన్మానం

కల్లూరు: బదిలీపై వెళ్తున్న కల్లూరు లిటిల్ ఫ్లవర్ చర్చి విచారణ గురువులను సంఘస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. చర్చిలో మూడు సంవత్సరాలుగా పనిచేసి సత్తుపల్లికి విచారణ గురువులుగా వెళ్తున్న.. రెవరెండ్ ఫాదర్ ఎలిసెంట్, సహాయ గురువులు రెవ.ఫాదర్ దేవదానం, లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం మేనేజింగ్ డైరెక్టర్ రెవ.ఫాదర్ లూర్దులను.. నూతన విచారణ గురువు సురేష్‌బాబు, సంఘస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘస్తులు ర్యాలీ నిర్వహించి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఫాదర్ సురేష్, సహాయ గురువులు విజయ్, మేనేజింగ్ డైరెక్టర్ పాదర్ ఆనంద్‌లను విచారణ సంఘం ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో ప్యారిస్ కమిటి ప్రెసిడెంట్ ఎనమాల రవీంద్ర, ప్రధాన కార్యదర్శి కోటా కిరణ్, ఉపాధ్యక్షుడు బూరుగు కనకయ్య, సభ్యులు అమలపుడి నాగరాజు, ఉబ్బన పుల్లమ్మ, పాగా సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



గురువులకు వీడ్కోలు పలుకుతున్న సంఘస్తులు

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి సాయమందిస్తున్న లక్కినేని రఘు, జర్నలిస్టులు

కల్లూరు: దాతల సాయంతో సేకరించిన ఆర్థిక సాయాన్ని కల్లూరు జర్నలిస్టుల ఆధ్వర్యంలో.. కేన్సర్ బాధితురాలు సరితకు ఆదివారం రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు అందించారు. కల్లూరులోని డబుల్‌బెడ్‌రూం గృహంలో నివాసముంటున్న ఆమెకు దాతలు అందించిన రూ.10వేలతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా లక్కినేని రఘు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే జర్నలిస్టులు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం గర్వించదగిన విషయమన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మండల అధ్యక్షుడు ధర్నాసి బాలరాజు, కార్యదర్శి కోట పుల్లయ్య, ఉపాధ్యక్షుడు ఉబ్బన బాబూరావు, కోశాధికారి వేము మోహన్, గౌరవ అధ్యక్షుడు డేవిడ్, ప్రచార కార్యదర్శి రోజ్ వేణు, రామ్ ప్రసాద్, ప్రభాకర్, కోటిరత్నం, సంగెపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.10 వేలు విరాళం

కారేపల్లి: మండలంలోని చర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి గాదెపాడు ఎంపీటీసీ సభ్యుడు భూక్యా సోనిజామ్లానాయక్‌లు రూ.10,516లను విరాళంగా ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు భక్తిభావాన్ని అలవర్చుకుంటే శాంతి సౌభాగ్యాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగండ్ల శ్రీను, ఉన్నం నాగేశ్వరరావు, బత్తుల శ్రీను, బత్తుల బాబు, వల్లభనేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సోనిజామ్లానాయక్

గ్రామీణ వైద్యులకు గుర్తింపునివ్వాలి



మాట్లాడుతున్న షేక్ సలీమ్

కొణిజర్ల: గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి గుర్తింపు నివ్వాలని గ్రామీణ వైద్యుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సలీమ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కొణిజర్ల శ్రీరామ కల్యాణ మండపంలో సంఘం వైరా డివిజన్ ప్రథమ మహాసభ రామడుగు వెంకటరామాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు నిరంతరం వైద్యసదుపాయాలు అందిస్తున్న వైద్యులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా నలుగురు నిరుపేద గ్రామీణ వైద్యులకు ఆర్థిక సాయం అందించారు. కార్య క్రమంలో కొణిజర్ల సర్పంచ్ రామారావు, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లక్ష్మీమణి, సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేణుకాచౌదరి జన్మదిన వేడుకలు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని డాక్టర్ మట్టా దయానంద్ క్యాంప్ కార్యాలయంలో రేణుకా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా రాగమయి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు, పారిశుద్ధ్య సిబ్బందికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా కార్యదర్శి అప్పారావు, ధనుంజయ్, ప్రసాద్, శ్రీను, గిరి, సందీప్‌గౌడ్, ఫక్రుద్దీన్, రమణ, చెన్నారావు, రాకేష్, గణేష్ పాల్గొన్నారు.

వైరా: వైరాలో రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, పీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్‌లు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, పుల్లయ్య, భాస్కర్, శ్రీకాంత్, సత్యనారాయణ, విశ్వనాథం, అన్వర్, కాంతయ్య, నాగరాజు, పరమేశ్వరరావు, కిరణ్, రామకృష్ణ పాల్గొన్నారు.



సత్తుపల్లి: పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ రాగమయి

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న లయన్స్ బాధ్యులు

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలో లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ పోరెడ్డి గోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆదివారం వృద్ధులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు పెనుగొండ ఉపేంద్రరావు, చింతోజు నాగేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.